క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



నీటి నిల్వలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

చిత్తూరు అర్బన్: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని పెద్ద హరిజనవాడలో శుక్రవారం ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టారు. వీధులన్నీ పరిశీలించి, పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, సిబ్బంది పీరూసాహెబ్ ఉన్నారు.

తవణంపల్లె తహసీల్దార్‌గా గుణశేఖర్‌రెడ్డి



తవణంపల్లె: మండల కార్యాలయంలో తహసీల్దార్‌గా కె.గుణశేఖర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న గుణశేఖర్ రెడ్డికి పదోన్నతిపై తవణంపల్లె తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్త ర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సుశీలమ్మ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నూతన కార్యవర్గం

చిత్తూరు రూరల్: రాయల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం చిత్తూరు నగరంలోని ఓ మండపంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా పీ.పార్థసారథి నాయుడు, అధ్యక్షులుగా నానబాల లోకేష్ రాయల్, కార్యదర్శిగా ప్రభాకర్, సంయుక్త కార్యదర్శిగా సత్యనారాయణ, సభ్యులను ఎన్నుకున్నారు.

ఇమామ్‌లు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్, మౌజాన్‌లు గౌరవ వేతనం కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు గఫార్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 232 మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజాన్‌లకు రూ.5 వేలు నెలవారీ గౌరవ వేతనాన్ని ప్రభుత్వం ఇస్తోందన్నారు. తాజాగా జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యాలయానికి అందిన ఉత్తర్వుల మేరకు ఆదాయం ఉన్నా, లేకున్నా మసీదు కమిటీ సభ్యులు గౌరవ వేతనానికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారని చెప్పారు. ఇతర వివరాలకు 9440003784, 9885099188ను సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రైతన్నలు బిజీబిజీ



గుడిపాల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవడంతో రైతన్నలు బిజీబిజీగా ఉన్నారు. ఓవైపు వేరుశనగ పంటకు సన్నద్ధం అవుతూ మరోవైపు వరి నాట్లలో నిమగ్నమయ్యారు. చెరువుల్లో నీరు బాగా ఉండడంతో బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో మండలంలోని పాపసముద్రం, గుడిపాల, వసంతాపురం, చిత్తపార, కుప్పిగానిపల్లె ప్రాంతాల్లో అధికశాతం రైతులు వరిపంట వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే 140 హెక్టార్లలో వరిపంటను సాగుచేశారు. ఇంకా 50 హెక్టార్ల వరకు వరి సాగు చేసేందుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు.

ఉపాధి జాతర

- రోజూ 2800 మంది కూలీలకు పనులు
- రూ.260 నుంచి రూ.272 రోజువారీ వేతనం
- ఉపాధి పనుల వద్ద నీడ, నీరు సదుపాయం

ఉపాధి హామీ పథకం గ్రామీణులకు వరంలా మారింది. మండు వేసవిలోనూ ఉదయం, సాయంత్రం వేళ పనులు చేసుకునే వెసులుబాటు ఉంది. పనులు చేసే ప్రదేశాల్లో నీడ, తాగునీటి సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. అడిగిన వారందరికీ అధికార యంత్రాంగం పని కల్పిస్తోంది. దీంతోపాటు పని వేళలను 5 గంటలుగా నిర్ణయించింది. కూలీలందరికీ గరిష్టంగా 270 వరకూ రోజుకు అందుతోంది. ఫలితంగా కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.





గట్రాళ్లమిట్టలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు, పాపిశెట్టిపల్లె చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

గుడిపాల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు జోరుగా సాగుతున్నాయి. చిత్తూరు నియోజకవర్గంలో రోజూ 2800 మంది కూలీలు పనుల్లో పాల్గొంటున్నారు. చెరువులు, వంకలు, వాగుల పనులు అధికంగా చేపట్టారు. వేసవిలో ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలకు ఇబ్బందులు కలగకుండా ఉదయం, సాయంత్రం రెండు పూటలా పనులు చేసుకొనేందుకు అవకాశం కల్పించారు. రోజువారీ వేతనం ప్రతి కూలీకి రూ.200 నుంచి రూ.250వరకు అందేలా చర్యలు తీసుకున్నారు. చీలాపల్లె, పేయనపల్లె, పాపిశెట్టిపల్లె ప్రాంతాల్లో చెరువుల్లో, 189కొత్తపల్లె, బసవాపల్లె, గట్రాళ్లమిట్ట, నారగల్లు, ఏఎల్‌పురం, వెంగమాంబపురం, చిత్తపార, బండపల్లె ప్రాంతాల్లో కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నారు. చెరువుల్లో 300 మందికి పైగా పనులు చేస్తుండగా, రెండువేల మందికి పైగా కూలీలు వివిధ రకాల పనులు చేస్తున్నారు. ఇతర పనులకు వెళితే రూ.300కు మించి రాదు. పైగా ఎండా, గాలికి లెక్కచేయకుండా 8 నుంచి 9 గంటలపాటు పనిచేయాలి. ఈ క్రమంలో ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. అధికార యంత్రాంగం కూలీలకు పూర్తి సహకారం అందిస్తూ ప్రోత్సహిస్తోంది. కూలీలకు సకాలంలో నగదును జమ చేస్తోంది. అడిగిన వారందరికీ ఉపాధి జాబ్ కార్డులందిస్తూ పని కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉపాధి కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

నియోజకవర్గంలోని జాబ్‌కార్డుల సంఖ్య	: 11310
యాక్టివ్‌లో ఉన్న జాబ్‌కార్డుల సంఖ్య	: 19987
జాబ్‌కార్డులో ఉన్న కూలీల సంఖ్య	: 36,541
యాక్టివ్‌లో ఉన్న కూలీల సంఖ్య	: 13326
ప్రస్తుతం చేస్తున్న పనుల సంఖ్య	: 2786

రోజు కూలీ రూ.262



మాకు రోజు కూలీ రూ.262 వస్తుంది. ఉదయం 6 గంటలకు వెళ్లి 9 వరకూ, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు 5 గంటల పాటు పనిచేస్తాం. కూలి మాత్రం రూ.262కు తక్కువ లేకుండా వస్తోంది. ఇతరత్రా పనులకు వెళితే 8 నుంచి 9 గంటలు పనిచేస్తే రూ.300 ఇస్తారు. ఈ పని చాలా బాగుంది. పనులు చేసే వద్ద అన్ని వసతులు కల్పిస్తున్నారు.

– శిరోమణి, ఉపాధి కూలీ, మొగరాళ్లపల్లె

అడిగిన వారందరికీ పని



ఉపాధి హామీలో అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నాం. చెరువు, కాలువ పనులు వద్ద కూలీలకు నీడ ఏర్పాటు చేశాం. తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. ఎండ అధికంగా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళ పనులు చేయిస్తున్నాం. వారు చేసిన పనికి తగ్గట్టుగా కూలీలు డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నాం. రూ.262 నుంచి రూ.272 వరకు కూలీలకు గిట్టుబాటవుతోంది.

– గోపి, ఫీల్డ్ అసిస్టెంట్, మొగరాళ్లపల్లె

అందరికీ పనులు



జాబ్‌కార్డ్ కలిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తున్నాం. చాలా మంది ఉపాధి కోసం ముందుకు వస్తున్నారు. ప్రభుత్వం కూలీరేట్లను బాగా పెంచింది. 5 గంటలు పనిచేస్తే రూ.265 వరకు వస్తుంది. అక్కడే తాగునీటి సౌకర్యం కల్పించాం. ప్రస్తుతం చెరువు, కాలువ పూడికతీత పనులు ఎక్కువగా చేపట్టాము. సకాలంలో కూలీలకు వారి ఖాతాల్లో నగదును జమ చేస్తున్నాం.

– మధుసూదన్, ఇన్‌చార్జ్ ఏపీవో, గుడిపాల

సెలవులో మునిసిపల్ కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కమిషనర్ అరుణ సెలవుపై వెళ్లారు. శుక్ర, శనివారాల్లో ఈమె వ్యక్తిగత కారణాలతో సెలవు పెట్టారు. ఇన్‌చార్జ్ కమిషనర్‌గా సహాయ కమిషనర్ గోవర్ధన్ వ్యవహరించనున్నారు.

పేద విద్యార్థులకు వరం ప్రభుత్వ బడులు



కొదలమడుగులో విద్యార్థులకు జేవీకే కిట్లను అందిస్తున్న సర్పంచ్, ఎంపిటీసీ

బంగారుపాళెం: పేద విద్యార్థుల ప్రభుత్వ బడులు వరమని కొదలమడుగు సర్పంచ్ మాలతి, ఎంపీటీసీ సభ్యులు రవీంద్ర అన్నారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. వారు మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ బడులను ఆధునీకరించి కార్పొరేట్ పాఠశాలలుగా తీర్చిదిద్దారని చెప్పారు. అనంతరం 8వ తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్పంచ్ మాలతి రూ.5116 నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సంజీవి, పాఠశాల కమిటీ చైర్మన్ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు అందుకున్న విద్యార్థినులతో అధ్యాపకులు

యాదమరి: మండలంలోని కె. గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో ఉన్న బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను స్థానిక సర్పంచ్ రాధ చేతుల మీదుగా అందించారు. కళాశాలలో శుక్రవారం ఉదయం సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాలను విద్యార్థినులందరికీ అందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ మండల పరిధిలోని కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో ఇంటర్ తరగతులు ప్రారంభించామని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులతోపాటు ఎంపీటీసీ సభ్యులు దుర్వాసులు, ఉప సర్పంచ్ ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

తవణంపల్లె: విద్యుత్ వినియోగదారుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని పైపల్లె ఏడీఈ సుబ్రమణ్యం, అరగొండ ఏఈ కృష్ణకి షోర్ తెలిపారు. మండలంలోని అరగొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఏడీఈ సుబ్రమణ్యం మాట్లాడుతూ వినియోగదారులు తమ సమస్యలను మా దృష్టికి తీసుకొస్తే వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురైతే వెంటనే బాగు చేయించి అమర్చుతామన్నారు. కొత్త సర్వీసులకు రైతులు దరఖాస్తు చేసుకొంటే నెలరోజుల్లో సర్వీసు, ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేస్తామన్నారు.

పశు పోషణపై అవగాహన అవసరం



మేకలకు నట్టల నివారణ మందు తాగిస్తున్న డాక్టర్ సాయిసుధ

గుడిపాల: పశుపోషణపై ప్రతి ఒక్క రైతుకూ అవగాహన కల్పించాల్సిన అవసరముందని పశువైద్యాధికారి సాయిసుధ తెలిపారు. ఏఎల్‌పురంలో శనివారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును ఆమె తాగించారు. ఆమె మాట్లాడుతూ రానున్నది వర్షాకాలం కావడంతో ప్రతి ఒక్కరూ నట్టల నివారణ మందును తాగించాలని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం గొర్రెలు, మేకలకు బీమా సదుపాయం కల్పించినందున ఏడాదికి రూ.35 చెల్లిస్తే, పరిహారంగా రూ.6వేలు వస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. పాడి పశువుకు రూ.400 చెల్లించినట్లయితే మూడేళ్ల పాటు బీమా వర్తిస్తుందని, పాడిఆవు చనిపోతే రూ.30వేలు పాడిరైతు ఖాతాలో జమ అవుతుందని చెప్పారు. నాటు ఆవుకు రూ.15వేలు అందజేయనున్నట్లు వివరించారు. మండలానికి 500 పశువులకు చొప్పున ప్రస్తుతం బీమా చేయనున్నట్లు ఆమె తెలిపారు. మిగతా వాటికి దశలవారీగా చేపట్టనున్నట్లు వివరించారు.

'గురుకుల'కు 35 మంది ఎంపిక

బైరెడ్డిపల్లె: మండలంలోని వివిధ గ్రామాల నుంచి కమ్మనపల్లె గురుకుల పాఠశాలకు 35 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు ఎంఈఓ సాయిలీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద విద్యార్థులకు గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందుతుందన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

కార్వేటినగరం: మండల తహసీల్దార్‌గా రవికుమార్‌రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పుత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై కార్వేటినగరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది శాలువలు కప్పి, పుష్పగుచ్ఛంతో ఘనంగా స్వాగతం పలికారు.

సచివాలయాల సేవలపై ఆరా



సిబ్బందికి సూచనలు ఇస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

గుడిపాల: సచివాలయంలో ప్రజలకు అందిస్తున్న సేవలపై జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆరా తీశారు. వసంతాపురం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిజిటల్ అసిస్టెంట్ రాజేష్ వద్ద ఎన్ని సేవలను ప్రజలకు అందజేస్తున్నారు. ఇంతవరకు ఎన్ని సేవలు అందజేశారు అని రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో 540 సేవల వరకు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పీ నెంబర్లు పనిచేస్తున్నాయా లేదా అని స్వయంగా ఆయనే తనిఖీ చేశారు. ఆయనతో పాటు తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

189కొత్తపల్లెలో..

189 కొత్తపల్లె సచివాలయాన్ని ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు, హాజరు పుస్తకాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారుల వివరాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని చెప్పారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు







ఐరాల: వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత, తవణంపల్లె: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు, గుడిపాల: వైద్యశిబిరంలో డాక్టర్ సందీప్

ఐరాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజల చెంతకే వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత అన్నారు. మండలంలోని పి.కట్టకిందపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో వైద్యాధికారి 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు జాగ్రత్తలు

తవణంపల్లె: గర్భిణులు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉప్పొంకలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, నీరజ, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోత్స్న, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

గుడిపాల: వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సందీప్ అన్నారు. మందిక్రిష్టాపురం గ్రామంలో శనివారం 104 ఆధ్వర్యంలో వైద్యసేవలను ఆయన అందించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వం వైద్య రంగంలో పెను మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

అవగాహన సదస్సు

యాదమరి: ప్రజలకు వైద్య పరంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసమే జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహిస్తున్నట్లు యాదమరి ప్రభుత్వాస్పత్రి వైద్యులు తెలిపారు. మండలంలోని మోర్దానపల్లె సచివాలయ పరిధిలో శుక్రవారం ఈఓపీఆర్‌డీ హరిప్రసాద్ రెడ్డి అధ్యక్షతన గ్రామీణ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ మాట్లాడితే గ్రామీణులకు వైద్యం మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానం తీసుకొచ్చిందన్నారు. అందులో భాగంగా 104 వాహనంలో 67 రకాల మందులతో ఇంటి వద్దకే వచ్చి వైద్యం అందిస్తారని వివరించారు. సర్పంచ్ మీనా, బుడితరెడ్డిపల్లె సర్పంచ్ వాసురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై ఫిర్యాదుల వెల్లువ

- సమస్యలు చెప్పినా పట్టించుకోలేదన్న ప్రజాప్రతినిధులు
- తీరు మార్చుకోవాలంటూ ఎమ్మెల్యే ఆగ్రహం





పూతలపట్టు: తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, ఐరాల: ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదంటూ తహసీల్దార్ విజయభాస్కర్‌పై ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తీరు మార్చుకోవాలంటూ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుమారి అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ, మండలంలో పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. యం.బండపల్లిలో రైతు సర్వేనెంబరు 859లో ఉన్న తన భూమి వివరాలను ఆన్‌లైన్లో గ్రామకంఠంగానూ, స్వభావంలో ప్రభుత్వ భూమిగానూ ఉందని ఫిర్యాదు చేశారు. ఈ వివరాల సవరణ కోసం రెండు నెలలుగా తహసీల్దార్‌కు చెబుతున్నా పట్టించుకోవడం లేదని బండపల్లి ఎంపీటీసీ సభ్యుడు యతీష్ ఫిర్యాదు చేశారు. ఆ భూమి యజమానికి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ భూమిని ఆక్రమణ నుంచి కాపాడాలని మూడేళ్ల నుంచి విన్నవిస్తున్నా తహసీల్దార్ పట్టించుకోవడం లేదని తోటకనుమ సర్పంచ్ బాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తహసీల్దార్‌కు సూచించారు. నియోజకవర్గంలో పూతలపట్టు తహసీల్దార్‌పైనే అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, తీరు మార్చుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సచివాలయం, ఆర్బీకే, హెల్త్‌సెంటర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దేవిక, వైస్‌ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, జయచంద్రారెడ్డి, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఐరాల: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మోహన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి కృషి చేయాలన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి కొంతమంది ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కాకపోవడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరు కాని వారికి నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓ నాగరాజుకు ఆదేశించారు. ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో 65 పాఠశాలల్లో చదువుతున్న 3,180 మంది విద్యార్థులకు తొలిరోజే జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశామన్నారు. మండలంలో 2286 మందికి ఇళ్లు మంజూరైతే, 1244 నిర్మాణాలు పూర్తయ్యాయని హౌసింగ్ ఏఈ శ్రీనివాసన్ చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ జూలైలో ఇళ్ల నిర్మాణాలు పూర్తియ్యేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలోని జగనన్న కాలనీలకు విద్యుత్ పనులు 95 శాతం పూర్తిచేశామని ట్రాన్స్ కో ఏఈ చలపతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సుచిత్ర, వైస్ ఎంపీపీలు నిత్య, రోజా, కో-ఆప్షన్ మెంబర్ హారూన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాతకు రైతు భరోసా

ఐరాల: అన్నదాతలకు ఆసరాగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే చెప్పారు. మండలంలోని వేదగిరివారిపల్లెలో శుక్రవారం రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎరువులు, విత్తనాలు తదితర అవసరాల కోసం మండల, జిల్లా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారని, ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇంటిముంగిటే అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీపీ మోహన్, సర్పంచ్ రాజేంద్రతోపాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.